క్లుప్తంగా

అంధ విద్యార్థులకు వితరణ



అంధ విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కుమారుడు నాగేంద్రబాబు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని లూయీ అంధుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మ ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు నాగేంద్రబాబు శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అంధ విద్యార్థులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేసి నాగేంద్రబాబు వారికి స్వయంగా వడ్డించారు.

ఎమ్మెల్యే పొన్నాడకు పలువురి పరామర్శ



ఎమ్మెల్యే పొన్నాడను పరామర్శిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబీకుల దశ దిన కార్యక్రమం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఇంటి వద్ద ఆయన పర్యవేక్షణలో శనివారం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యే పొన్నాడ సన్నిహితులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాకినాడ మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీటీడీ ఎస్వీబీసీ అడ్వైజర్ అడపా దుర్గ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పొన్నాడను పరామర్శించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



గోపవరంలో వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరానికి చెందిన వెల్లగొట్ల దుర్గాప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. దుర్గాప్రసాద్ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ కుంచే బుల్లియ్య శనివారం అందజేశారు. మిగిలిన వైఎస్సార్ బీమా సొమ్ములు నేరుగా వారి ఖాతాలో జమవుతాయని సర్పంచ్ బుల్లియ్య వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, కుంచే స్వామి, కిట్టు, గ్రేడ్-5 కార్యదర్శి సుమ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఇమ్మిడివరప్పాడులో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దేవరపల్లి గీత

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు మదర్‌థెరిసా వృద్ధాశ్రమంలో శనివారం గీత ఫౌండేషన్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి గీత ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. శనివారం వృద్ధాశ్రమాన్ని సందర్శించిన దేవరపల్లి గీత వృద్ధులతో మాట్లాడి వారికి అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు రాపాక సలోమి, వైఎస్సార్ సీపీ నాయకుడు వరసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని ప్రజలందరికీ తెలియజేసేందుకే వికసిత్ భారత్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టూరి నాగమణి, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు, రాయుడు గంగాధర్, రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో పేదల సంక్షేమం

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్
- పలు గ్రామాల్లో పింఛన్ల అందజేత



కామనగరువులో లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందిస్తున్న మంత్రి విశ్వరూప్



అల్లవరంలో లబ్ధిదారులకు పెన్షన్ కానుకని అందిస్తున్న ఎంపీ అనురాధ

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కామన గరువులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్కా అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాటకు అనుగుణంగా పెన్షన్ కానుక రూ.3,000కు పెంచి అందించడం అవ్వతాతలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ పెంపు వల్ల ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే ఇప్పటివరకూ 14,219 మందికి రూ.130.20 కోట్లు అందించామన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కామనగరువులోని గణేష్‌నగర్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, ఎంఎస్ఎన్ కాలనీ రూ.39.60 లక్షలతో మంచినీటి ట్యాంకు పనులకు, జంగంపాలెంలో రూ.37 లక్షలతో సీసీ గ్రావెల్ రోడ్డుకు, బీవీ రమణయ్య కాలనీ, సీతారామరాజు నగర్‌ల్లో రూ.33 లక్షలతో సీసీ గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి, రాజులపూడి వెంకటేశ్వరరావు కాలనీలో రూ.43 లక్షలతో సీసీ గ్రావెల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రతాప్‌నగర్‌లో రూ.8 లక్షలతో ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణానికి, ఎస్ఎన్ కాలనీలోని రూ.40 లక్షలతో సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ నక్కా అరుణ కుమారి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అల్లవరం: పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం అల్లవరం హైస్కూల్ వద్ద వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమానికి ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదంగా జీవనం సాగించేందుకు అవ్వతాతలు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఈ నెల నుంచి రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తూచా తప్పకుండా అమలుచేశారని చెప్పారు. దేశంలో లబ్ధిదారులకు ప్రతీనెలా రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదవారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారని, పెన్షన్ కోసం నెలల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం దక్కేది కాదన్నారు. ఇప్పుడు ఏడాదిలో రెండు సార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ పేదలకు అండగా ఉంటున్నామన్నారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని అందిస్తూ దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ నిలిచారన్నారు. సంక్షేమానికి కొత్త నిర్వచనం సృష్టించారని ఎంపీ అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం అల్లవరం మండలంలో కొత్తగా మంజూరైన 216 పింఛన్లను మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ ఎస్.మౌనిక, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా కార్యదర్శి మెరికల శ్రీను, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి దాసం రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బోసు, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబ శివప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులు పట్టణ ఖ్యాతిని పెంచాలి



విజేతలకు క్రీడా దుస్తులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్

అమలాపురం టౌన్: స్థానిక క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి వరకూ వెళ్లి పట్టణ ఖ్యాతిని పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఆకాంక్షించారు. మున్సిపాలిటీలోని 15వ వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటలు ముగిసిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం సాయంత్రం జరిగిన ముగింపు సభకు సత్య నాగేంద్రమణి అధ్యక్షత వహించి ప్రసంగించారు. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు ముగిసి మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. అనంతరం విజేతలైన క్రీడాకారులకు చైర్‌పర్సన్, కమిషనర్‌లు టీ షర్టులను అందజేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్ బండారు గోవిందు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు వంకాయల కాశి, జాన్ బెల్లీ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, దొంగ చిన్న తదితరులు పాల్గొన్నారు. తదితరులు

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, రెడ్డి రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఎస్టీయూ వజ్రోత్సవాల్లో మంత్రి విశ్వరూప్



భీమనపల్లిలో మొక్కలు నాటుతున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ విద్యారంగం పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు సైతం విశేష కృషి చేస్తున్న ఎస్టీయూ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, హెచ్ఎం సత్యనారాయణ, ఎస్టీయూ మండల అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నూకల ఋషేంద్ర, ఉపాధ్యాయిని జిల్లా కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, పీఏసీ చైర్మన్ సబ్బతి జ్యోతి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మండలి మండల చైర్మన్ మానే శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య



నీలపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నారని, ఆ ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శనివారం చొల్లంగి, నీలపల్లి జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్స్‌లో జరిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దారన్నారు. బైజూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు అత్యాధునిక డిజిటల్ విద్యాబోధనను చేరువ చేశారని కొనియాడారు. చొల్లంగిలో 87, నీలపల్లి హైస్కూల్‌లో 118 మంది 8వ తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌తో కలిసి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మోకా ఉమ, చొల్లంగి, నీలపల్లి హెచ్ఎంలు రాజేశ్వరి, సీహెచ్ రాధాకృష్ణ, నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, చొల్లంగి ఉపసర్పంచ్ స్వర్ణ రాజు, రాయుడు గంగాధర్, రేవు మల్లీశ్వరి, రెడ్డి సతీష్, కడియాల శ్రీను, నీలపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షతల అందజేత



అయోధ్య రాముని అక్షతలతో మహిళలు, రాముడు, సీత, లక్ష్మణ, అంజనేయ స్వామి వేషధారణల్లో ఉన్న చిన్నారులు



పి.మల్లవరంలో అయోధ్య శ్రీరాముని అక్షతలను ఇంటింటికీ అందజేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: పట్టణంలోని సీతాపతిరావుపేటలో అయోధ్య బాలరాముని అక్షతలు ఇంటింటికీ అందజేత కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులతో రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వేషధారణలు వేసి అలరించారు. ముత్తైదువులు ఇంటింటికీ వెళ్లి ఈ నెల 22న అయోధ్యలో జరుగుతున్న శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం గురించి చెబుతూ వారిని సాదరంగా ఆహ్వానించి అక్షతలు అందజేశారు. పట్టణంలోని విత్తనాలవారి కాల్వ గట్టు ప్రాంతంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామ మందిరం ప్రారంభ ఆహ్వాన పత్రాన్ని, అయోధ్య అక్షతలను, శ్రీరాముడి చిత్రపటాలను అందజేశారు. భజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి శిరంగు నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలో అయోధ్య శ్రీరామ స్పర్శ అక్షతలను శనివారం ఇంటింటికీ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటాన్ని చేతబూని జైరామ్ అంటూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రం, అక్షతలను భక్తులకు అందజేసారు. కార్యక్రమంలో నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, విళ్ల సత్యనారాయణ, వీర, ముత్యాల జయలక్ష్మి, బోస్, ధూళిపూడి సుబ్బారావు, చిట్టిబాబు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష



కాట్రేనికోనలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

గ్రామాల్లో రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపులు

కాట్రేనికోన: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుంది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల ఇంటి ముంగిటకే వైద్యులను పంపిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సమస్య తీవ్రతను విశ్లేషించి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్రచికిత్స చేసేందుకు పంపిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వల్ల గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రజల ముంగిటకు వైద్యులే వచ్చి పరీక్షించి మందులివ్వడం గతంలో ఎన్నడూ చూడలేదంటూ నిరుపేదలు సంతోషం వెలిబుచ్చుతున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాల ప్రారంభంపై హర్షం వ్యక్తమవుతుంది.

ఇంటిల్లిపాదికీ ఆరోగ్య సేవలు అందించాలనే ధ్యేయంతో ఇంటింటా ఆరోగ్య సర్వేను చేపట్టిన ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో వైద్య సేవలు అందించింది. తొలి విడతలో చేపట్టిన శిబిరాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన రావడంతో తాజాగా రెండో విడత శిబిరాలను ప్రారంభించింది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ఏడెనిమిది రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, కంటి విభాగాలకు చెందిన డాక్టర్లు ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య సేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను మెరుగైన చికిత్స కోసం ఉన్నత సౌకర్యాలున్న ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్టాల్స్ పెట్టి ప్రదర్శిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సంరక్షణ విప్లవం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, సంపూర్ణ పోషణ, కంటి వెలుగు, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 సేవలు, విలేజ్ హెల్త్ క్లినిక్, డాక్టరు చదువుల కోసం వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు నియామకాన్ని చేపట్టి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. మండలంలోని కాట్రేనికోన, పల్లంకుర్రు పీహెచ్‌సీల పరిధిలో మొదటి విడతగా 21 గ్రామ సచివాలయాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించి సుమారు 10,243 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మందులను ఉచితంగా అందచేశారు. కాట్రేనికోన పీహెచ్‌సీ పరిధిలో పల్లం-1లో 786 మందికి, పల్లం-2లో 502 మందికి, కాట్రేనికోన-2లో 580 మందికి, కాట్రేనికోన-3లో 409 మందికి, కాట్రేనికోన-4లో 526 మందికి, నడవపల్లి 546 మందికి, చెయ్యేరు-1లో 486, చెయ్యేరు-2లో 467 మందికి, చిర్రయానం 456 మందికి, ఉప్పూడి 436 మందికి, పెనుమల్లే 432 మందికి మొత్తం 5,626 మందికి, పల్లంకుర్రు పీహెచ్‌సీ పరిధిలో 4,617 మందికి వైద్య సేవలు అందించారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం అదనపు వైద్య పరీక్షలు కోసం సుమారు 96 మందిని రోగులను రిఫర్ చేశారు.

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాట్రేనికోన ఎంపీడీఓ వెంకటాచలం అన్నారు.

స్వామివారి క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: స్థానిక వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను భట్నవిల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది క్యాలెండర్ స్వామివారి చిత్రాలతో కనుల పండువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల విరీతదేవీ, ఈఓ దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ధర్మకర్తల మండలి సభ్యులు నడింపల్లి వర్మ, కాశి చంటి, దూనబోయిన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి



గొల్లవిల్లిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి రాబోయే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు సూచించారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లంకా రాణి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ఎంఈవో కె.కిరణ్‌బాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 598 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేవీఎస్ గౌరీకుమారి, ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ, పార్టీ నాయకులు వీరవిల్లి చినబాబు, జొన్నాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నీటి పక్షుల గణన ప్రారంభం



నీటి పక్షుల గణనకు వెళుతున్న జిల్లా అటవీ శాఖ అధికారి భరణి తదితరులు

తాళ్లరేవు: ఏసియన్ వాటర్ బర్డ్ సెన్సెస్- 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం నీటి పక్షుల గణనను జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి ప్రారంభించారు. కోరింగ మడ అటవీ ప్రాంతంలో సంచరించే వివిధ రకాల పక్షులు, దూర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులను లెక్కించేందుకు నలుగురు సభ్యులతో కూడిన 12 బృందాలు శనివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ప్రత్యేక కెమెరాలతో లెక్కింపు చేపట్టారు. పక్షుల ఆవాసాల్లో ప్రత్యేక కెమెరాలతో పక్షుల గణన చేపట్టనున్నట్లు భరణి తెలిపారు. ఈ కెమెరాల ద్వారా తీసిన చిత్రాలతోపాటు సభ్యులు గుర్తించిన వాటిని లెక్కించి రెండు, మూడు రోజుల్లో పక్షుల సంఖ్యను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఫీల్డ్ ఎక్స్‌పర్ట్ శ్రీరామ్‌రెడ్డి, నేషనల్ ఏసియన్ వాటర్ బర్డ్ సెన్సెస్ కోఆర్డినేటర్, బొంబే నేచురల్ హిస్టరీ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యసెల్వం, సైంటిస్టులు పర్వీన్ షేక్, డి.మహేష్‌బాబు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభల తీర్థం నిర్వహణపై ఆర్డీఓ సమీక్ష



జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఈ నెల 16న నిర్వహించే ప్రభల తీర్థం నిర్వహణపై కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి శనివారం సమీక్షించారు. గంగలకుర్రు పంచాయతీలో డీటీ ఎన్.నాగపద్మాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకాదశ రుద్రులు ఉత్సవ కమిటీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ సూచించారు. ప్రభల తీర్థం జరిగే ప్రాంతంలో మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు తదితర అంశాలపై చర్చించారు. పారిశుధ్య ఏర్పాట్లకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తికి ఆర్డీఓ సూచించారు. సమావేశంలో డీఎల్‌పీఓ ఎం.ప్రభాకర్, ఏపీడీ డి.రాంబాబు, డివిజనల్ వైద్యాధికారి సుమలత పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో శనివారం రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. భక్తుల రాకతో నవీన ఆలయంతో పాటు పాత గుడి కోలాహలంగా మారింది. వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.2.26 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.25 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

ధ్యానంతో మంచి లక్షణాలు అలవడతాయి

రావులపాలెం: ధ్యానం చేయడం వలన మనిషిలోని నెగిటివ్ ఆలోచనలు రావని, మూఢనమ్మకాలు తొలగి భయం తొలగిపోవడంతో పాటు, ధైర్యం, ఓర్పు, సహనం, సరైన ఆలోచనలు, ధ్యానంతో అలవాటు పడతాయని, మంచి జీవన విధానం, సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, మోక్షం మొదలగు మంచి లక్షణాలు ధ్యానం వలన వస్తాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా కన్వీనర్ ఎస్.అనిత విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావులపాలెంలో మెడిటేషన్ (ధ్యానం)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిత, సొసైటీ సభ్యులు సీహెచ్ నాగలక్ష్మి, పి.ఉషారాణి, వర్మ, నాగలక్ష్మి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బృందావన్ ప్రేమికుల సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలను ప్రతి ఒక్కరూ వారి ఇంటి దగ్గర నాటి, వాటిని పోషించి పర్యావరణాన్ని రక్షించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మానవునికి సహజవాయువు, ఆక్సిజన్ అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, రమేష్‌బాబు, హేమలత, బీపీఎన్ రెడ్డి హరిబాబు, పూజ శ్రీనివాస్, సుభాషిణి, శైలజ, సిద్ధార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.